ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా..

- ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- విద్యార్థులను ఏ, బీ, సీ కేటగిరీగా విభజన
- చదువులో వెనుకబడి ఉన్నవారిపై ప్రత్యేక శ్రద్ధ



నూజివీడు మధుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతుల్లో విద్యార్థిని సందేహాలను నివృత్తి చేస్తున్న అధ్యాపకుడు

నూజివీడు: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులు ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఇంటర్ బోర్డు అధికారులు ప్రత్యేక కార్యాచరణను రూపొందించారు. దీనిలో భాగంగా ఈనెల 1నుంచి సంకల్ప్–2025 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా గడువు సమయాన్ని పెంచి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. నూజివీడులోని మధుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీలతోపాటు ఒకేషనల్ కోర్సులైన కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ, సీఎస్ఈ బ్రాంచిలు ఉన్నాయి.
ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 265మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 137 మంది విద్యార్థులు ఉన్నారు.
100 శాతం ఫలితాలే సాధనగా ముందుకు సాగుతున్నారు.

ప్రత్యేక తరగతులు

ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో గతంలో ఉదయం 9.30నుంచి సాయంత్రం 4.30 వరకు తరగతులు ఉండేవి. ఈనెల ఒకటో తేదీ నుంచి ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అన్ని సబ్జెక్టుల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులకు అధ్యాపకులు తర్ఫీదు ఇస్తున్నారు. చదువులో వెనుకబడిన వారు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజన

క్వార్టర్లీ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించారు. చదువులో వెనుకబడిన వారిని సీ కేటగిరిగా విభజించారు. వీరి కోసం ఇంటర్‌బోర్డు ప్రతి ప్రభుత్వ జూనియర్ కాలేజీకి అన్ని గ్రూపులకు సంబంధించిన క్వశన్ బ్యాంకును సరఫరా చేసింది. వెనుకబడిన విద్యార్థులు కూడా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా తర్ఫీదు నిచ్చేందుకు జూనియర్ లెక్చరర్లను కేర్ టేకర్లుగా నియమించారు. కేర్ టేకర్లు వారికి కేటాయించిన విద్యార్థులను ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చదివించడం, రాయించడం చేస్తున్నారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు.

ఉపయోగకరంగా ఉన్నాయి..



కాలేజీలో నిర్వహించే ప్రత్యేక తరగతులు ఉపయోగకరంగా ఉన్నాయి. ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చదివించడంతోపాటు చూడకుండా రాయిస్తున్నారు. చదువులో వెనుకబడి ఉన్న వారిని గుర్తించి వారి పట్ల మరింత శ్రద్ధ తీసుకుంటున్నారు.
– పాల్తియా హైమావతి, సెకండియర్ బైపీసీ

సందేహాలను నివృత్తి చేస్తున్నారు..



ప్రత్యేక తరగతుల్లో సందేహాలను అడిగితే అధ్యాపకులు నివృత్తి చేస్తున్నారు. అన్ని సబ్జెక్టులు చదవించడంతో పాటు రాయిస్తున్నారు. ఈ తరగతులు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. మాతో పాటు సాయంత్రం 5 గంటల వరకు అధ్యాపకులు ఉండి స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు.
– వేమిరెడ్డి రిచితరెడ్డి, సెకండియర్ ఎంపీసీ

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం..



నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నాం. కేర్ టేకర్లను నియమించి విద్యార్థులు ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో గుర్తించి వారికి ప్రత్యేకంగా బోధన తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులపై వ్యక్తిగతంగా శ్రద్ధతీసుకుని సబ్జెక్టుల్లో వారి సందేహాలను నివృత్తి చేస్తున్నాం.
– ఎం.స్వర్ణలత, ప్రిన్సిపాల్, జూనియర్ కళాశాల, నూజివీడు

క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

విస్సన్నపేట: లయన్స్ క్లబ్ ఆఫ్ విస్సన్నపేట, నూజివీడు అమెరికన్ హస్పిటల్ వారి సహకారంతో స్థానిక లయన్స్‌క్లబ్‌లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు వి.కిరణ్ ఆదివారం తెలిపారు. కంటి వైద్యనిపుణులు డాక్టర్ ప్రభుదాస్ పాల్గొని వైద్యపరీక్షలు చేస్తారని వివరించారు. ఈ వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఓటు దరఖాస్తుకు నేడు తుదిగడువు

ఇబ్రహీంపట్నం: కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేసినట్లు తహసీల్దార్ వై. వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ ఆరోతేదీ వరకు వచ్చిన అర్జీలను పరిశీలించినట్లు వివరించారు. ప్రస్తుతం ఓటర్ల జాబితాను మండల రెవెన్యూ, కొండపల్లి మున్సిపాలిటీ కార్యాలయాల్లో ప్రదర్శనకు ఉంచినట్లు తెలిపారు. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. నూతనంగా ఓటు నమోదుకు ఈనెల 9వతేదీ సోమవారం లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ



మైలవరం: జి.కొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు దాతలు కొండేటి శ్రీనివాసరావు, కొండలరావు అందించిన 350 భోజనం ప్లేట్లను ప్రధానోపాధ్యాయిని ఎం. శ్రీలతకు ఆదివారం పంపిణీ చేశారు. దాతలు వారి తల్లిదండ్రులు కొండూటి నాగేశ్వరరావు, అన్నపూర్ణమ్మ జ్ఞాపకార్థం విద్యార్థులకు ప్లేట్లు అందజేసినట్లు హెచ్ఎం తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉయ్యూరు వెంకట నరశింహారావు, మండల టీడీపీ అధ్యక్షుడు పజ్జూరు రవికుమార్, తెలుగు యువత నాయకుడు ఉయ్యూరు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత యోగా శిక్షణ తరగతులు ప్రారంభం



కొండపల్లి(ఇబ్రహీపట్నం): శ్రీవెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొండపల్లి బీకాలనీ ఆడిటోరియంలో ఆదివారం ఉచిత యోగా శిక్షణ తరగతులు ప్రారంభించారు. ప్రముఖ యోగా గురువు లంకే జనార్దన్ మాట్లాడుతూ యోగా విశిష్టత వివరించారు ఏటా డిసెంబర్ 21న ధ్యాన దినోత్సవం నిర్వహించేందుకు ఐక్యరాజ్య సమితి చేసినట్లు తెలిపారు. యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని వివరించారు. అనంతరం అభ్యాసకులకు యోగా, ప్రాణాయం, సూర్యనమస్కారాలు, యోగ ముద్ర, ధాన్యం, యోగనిద్ర అంశాలపై అవగాహన కల్పించారు. యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో పలువురు ఎన్టీటీపీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు



ఆగిరిపల్లి: దివ్యాంగులకు దాతలు చేస్తున్న సహకారం ఎంతో ప్రశంసనీయమని హీల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేరు సత్యప్రసాద్ అన్నారు. మండలంలోని తోటపల్లి హీల్ సంస్థలో ధనశిక్ష చారిటీస్ సంస్థ సహకారంతో 15 మంది దివ్యాంగులకు ఆదివారం కృత్రిమ కాళ్లను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ ప్రజ్వల్ సుంద్రు మాట్లాడుతూ హీల్ సంస్థ సహకారంతో ఇప్పటివరకు 28మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అందజేసినట్లు వివరించారు. ధనశిక్ష చారిటబుల్ సంస్థ ప్రతినిధులు సమీర్, లక్ష్మణ్, రితేష్, స్నేహిత్ హీల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టుషాపులపై దాడి.. ఇద్దరి అరెస్ట్

మైలవరం: మైలవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని జి.కొండూరులో గుత్తి శిరీష అనే మహిళ అనధికారికంగా మద్యం అమ్ముతుండగా ఆమె వద్ద నుంచి 11మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జే. శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. అదేవిధంగా మండలంలోని దుగ్గిరాలపాడులో వలేటి నరసింహారావు అనే వ్యక్తి అనధికారికంగా మద్యం అమ్ముతుండగా అతని వద్ద నుంచి 5 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

చిన్నారులకు పోషకాహారం పంపిణీ

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కేతనకొండ గ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ బాధిత చిన్నారులకు ఆదివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా రొమేనియా దేశానికి చెందిన మైఖేల్, బ్రదర్ జాన్ పాల్గొని 25మంది పిల్లలకు నూనె, కందిపప్పు, వేరుశెనగలు, బెల్లం, మినప్పప్పు, రాగిపిండి, గోధుమ పిండి, బిస్కెట్లు, గోధుమ రవ్వ, బకెట్లు పంపిణీ చేశారు. గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ పాస్టర్ ఎలీషా మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులైన చిన్నారులకు సామాజికంగా ధైర్యం నింపాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రేస్ మినిస్ట్రీస్ కార్యదర్శి సుమలత, సంఘ పెద్దలు అబ్రహం, అనిల్, నాగరాజు, హరీష్ , దీపిక, నాగుల్‌బి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

ముసునూరు: ఈనెల 10వ తేదీ నుంచి 28వ తేదీ వరకు మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ తెలిపారు. సదస్సుల తేదీల్లో మార్పులను ఆదివారం ఆయన వెల్లడించారు. 10వ తేదీన బలివే, 11న లోపూడి, 12న అక్కిరెడ్డిగూడెం, 13న యల్లాపురం, 16న గుళ్ళపూడి, 17న కొర్లగుంట, 18న ముసునూరు, 19న వేల్పుచర్ల, 20న సూరేపల్లి, 21న రమణక్కపేట, 23న చిల్లబోయినపల్లి, 24న కాట్రేనిపాడు, 26న చింతలవల్లి, 27న చెక్కపల్లి, 28న గోపవరం గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. గ్రామ సచివాలయాల వద్ద ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగనున్న సదస్సుల్లో రెవెన్యూ, అటవీ, దేవదాయశాఖల అధికారులు పాల్గొంటారన్నారు. ప్రజలు రెవెన్యూ సదస్సులకు హాజరై భూసంబంధిత సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని సూచించారు.

నేటినుంచి మేడూరులో సప్తాహాలు



మేడూరు శ్రీవీరాంజనేయ స్వామి

మేడూరు(గంపలగూడెం): ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన గంపలగూడెం మండలం మేడూరు శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం నుంచి హరే రామనామ సప్తాహ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మేనేజర్ విడిడి ప్రసాద్ తెలిపారు. మొదటి రోజు విఘ్నేశ్వర పూజతో ప్రత్యేక కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు కోమందూరి ఆంజనేయ చార్యులు ప్రారంభిస్తారన్నారు. 10వ తేదీన హనుమాన్ చాలీసా పారాయణం, 11వ తేదీన స్వామికి అష్టోత్తర శత కలశాభిషేకం, గీతా జయంతి ప్రత్యేక కార్యక్రమాలు, 12వ తేదీన లక్ష తమలపాకులతో స్వామికి విశేష అర్చన, 13వ తేదీన హనుమత్ వ్రతాలు, 14వ తేదీన సహస్రనామ సింధూర అర్చన, పూలఅర్చన, 15వ తేదీన దత్త జయంతి పూజలు, 16వ తేదీన హనుమత్ దీక్షాపరుల ఇరుముడి, పూర్ణాహుతి, శాంతికల్యాణం, భక్తులకు అన్నదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఘనంగా ఎస్వీఎస్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మైలవరం జమీందారు సుధాకరరావు, ఎమ్మెల్యే వెంకట కృష్ణప్రసాద్

మైలవరం: ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానముల చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త శ్రీరాజా సూరానేని వెంకట సుధాకరరావు 84వ జన్మదిన వేడుకలను మైలవరంలోని ఆయన దివాణంలో అభిమానుల మధ్య ఆదివారం ఘనంగా నిర్వహించారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పాల్గొని గజమాలతో జమీందారు సుధాకరరావును సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సుధాకరరావు భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం సేవలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జమీందారు తనయుడు లయన్ నివృతరావు, స్థానిక రాజకీయ నాయకులు, మిరియాల జగన్‌మోహనరావు, బంగారు వ్యాపారి బయన శ్రీనివాసరావు, గుజ్జుల కోటిరెడ్డి, డాక్టర్ సీహెచ్ బాలగోపాలరెడ్డి తదితరులు జమీందారు సుధాకరరావును కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

గృహ నిర్మాణాల ప్రగతిపై సమీక్ష



నూజివీడులో గృహనిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి పార్థసారథి

నూజివీడు: ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం మేరకు గృహ నిర్మాణాలను పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి హెచ్చరించారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆదివారం జిల్లాలోని గృహనిర్మాణాల ప్రగతిపై హౌసింగ్ అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి పేదవారికి ఇల్లు ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రణాళిక బద్ధంగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఎన్ని ఇళ్లు నిర్మించారు, ఇంకా ఎన్ని నిర్మించాల్సి ఉంది అని మంత్రి ప్రశ్నించగా సమగ్ర వివరాలు అధికారుల దగ్గర లేకపోవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు ప్రభుత్వం ఇచ్చిన పథకాలను లబ్ధిదారులకు సకాలంలో అందజేసే బాధ్యత అధికారులదేనన్నారు. జిల్లా పీడీ, అసిస్టెంట్ ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, అందరూ కలిసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమీక్షలో పీడీ, అసిస్టెంట్ ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు

చాట్రాయి: మండలంలోని సూరంపాలెంలో వేంచేసియున్న ఆంజనేయస్వామిని ఆదివారం తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

పేకాట స్థావరంపై దాడి

ఆగిరిపల్లి: నుగొండపల్లిలోని పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శుభశేఖర్ తెలిపారు.

శ్రీగంగానమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ



నూజివీడు: కొత్తరావిచర్లలో శ్రీగంగానమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠా కార్యక్రమం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోశ్ఛరణ నడుమ గణపతి హోమం, ప్రత్యేక పూజల నిర్వహణ అనంతరం పునఃప్రతిష్ఠ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రావిచర్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలతోపాటు నూజివీడు పట్టణ వాసులు పాల్గొన్నారు.

శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి విశేషంగా కుంకుమార్చనలు, చండీ హోమం నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. విశాఖపట్నం నుంచి వచ్చిన భక్తులు పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి చీరల వేలం జరిగింది. భక్తులు వేలంలో పాల్గొని అమ్మవారి చీరలను దక్కించుకున్నారు.

అర్హులకు ఇళ్లు ఇవ్వడమే లక్ష్యం : మంత్రి



మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

నూజివీడు: అర్హులకు ఇళ్లస్థలాలు, ఇళ్లు ఇవ్వాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమని గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడులో ఆదివారం నిర్వహించిన టూ వీలర్ మెకానిక్‌ల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. స్థల సేకరణపై సమీక్షించిన అనంతరం మెకానిక్ యూనియన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రయత్నం చేస్తానని చెప్పారు. అర్హులైన ప్రతి మెకానిక్‌కు పక్కా ఇళ్లు కట్టిస్తానని హామీ ఇచ్చారు. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో 25లక్షల ఇళ్లు కట్టించనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనతో కలిపి ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి పార్థసారథిని యూనియన్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మలిశెట్టి జగదీష్, కౌన్సిలర్ చెరుకూరి దుర్గాప్రసాద్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు 'మీకోసం' కార్యక్రమం

నూజివీడు: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్డీఓ మోవిడి వాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నూజివీడు ఎస్ఆర్ఆర్ హైస్కూల్లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

నూజివీడు: పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1983–84 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులంతా సమావేశమై ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఉల్లాసంగా గడిపారు. నూజివీడు ప్రాంత అభివృద్ధికి సమష్టిగా పనిచేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆనాటి ఉపాధ్యాయులు పీఎం కృష్ణారావు, వైవీ రాజు, ఎం.నరసింహారావు, కలపాల ప్రసాదరావు, రాధాకృష్ణ, జానకిరామయ్యలను ఘనంగా సత్కరించారు.

హిందూ సమ్మేళన కార్యక్రమం



మాట్లాడుతున్న వేదానంద సరస్వతి

గంపలగూడెం: జనవరి 5వ తేదీన విజయవాడలో జరిగే హైందవ శంఖారావం భారీ బహిరంగసభను విజయవంతం చేయాలని వేదనంద సరస్వతి మహారాజు బాబాజీ కోరారు. గంపలగూడెంలో ఆదివారం విశ్వహిందూ పరిషత్ గంపలగూడెం ఆధ్వర్యంలో హిందు సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ హిందువులు తమ ఐక్యతను చూపాలని పిలుపునిచ్చారు. వెంకటేశ్వర సేవా సమితి మండలం ప్రతినిధి ముత్యాల వెంకటేశ్వరరావు, రేగళ్ళ వీరారెడ్డి, కొత్తగుండ్ల నరసింహారావు, కాజా రవికుమార్, ఎల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

హిందూ ధర్మ ప్రచారవ్యాప్తికి కృషి చేయాలి




ముసునూరు: హిందూ ధర్మ ప్రచారవ్యాప్తికి అందరూ కృషి చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర ప్రచారక్ ముద్దు సాయిరామ్ కోరారు. జిల్లా ధర్మ ప్రచారక్ సింహాద్రి భూపతితో కలసి ఆదివారం ఆయన చింతలవల్లి, చెక్కపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా ధర్మ ప్రచారంతో పాటు, హైందవ శంఖారావాన్ని బలోపేతం చేసేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. సమరసత ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

•సద్గురువులకు స్వర నీరాజనం

విజయవాడకల్చరల్: ప్రముఖ సంగీత విద్వాంసుడు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 141వ జయంతి సందర్భంగా శివరామ కృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీతోత్సవాలను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పారుపల్లి రామకృష్ణయ్య పంతులు వంశానికి చెందిన సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ సద్గురువులకు స్వర నీరాజనాలు అందించారు.

రోడ్లను మూసివేసిన ముళ్లకంపలు

- మార్జిన్లు దాటి రోడ్లెక్కిన సర్కారు తుమ్మచెట్లు
- అడవులను తలపిస్తున్న వైనం
- ఇబ్బందుల్లో వాహనచోదకులు
- పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు



ముసునూరు సమీపంలో చెట్లతో మూసుకుపోయిన ప్రధాన రహదారి

ముసునూరు: మండలంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా ముళ్ల కంచెలు పెరిగిపోయి అడవులను తలపిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు చెట్లు, తుప్పలు పెరిగిపోయి రహదారులు కుచించుకుపోయినట్లుగా మారడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నూజివీడు–ముసునూరు–ఏలూరు ప్రధాన రహదారి, చింతలవల్లి–చెక్కపల్లి–లోపూడి ప్రధాన రహదారి, వలసపల్లి– బలివే–వేల్పుచర్ల రహదారి, గోగులంపాడు–అక్కిరెడ్డిగూడెం–రమణక్కపేట రహదారులకు ఇరువైపులా సర్కారు తుమ్మచెట్లు భారీగా పెరిగిపోవడంతో దారులన్నీ మూసుకుపోయాయి. ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చేవరకు కనిపించని పరిస్థితి నెలకొంది.
రోడ్లకు ఇరువైపులా పెరిగిన చెట్లు, తుప్పలు తొలగించాలని మండలపరిషత్ సమావేశాల్లో ఎన్నిసార్లు చెప్పినా ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలోని అన్ని రహదారి మార్జిన్లకు ఇరువైపులా పెరిగిన చెట్లను తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్అండ్‌బీ ఏఈఈ అశోక్‌బాబును వివరణ కోరగా రహదారులకు ఇరువైపులా పెరిగిన ముళ్లకంచెలు తొలగింపునకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. నిధులు మంజూరు కాగానే జంగిల్ క్లియరెన్స్ చేపడతామని వివరించారు.

రోడ్డు మార్జిన్లు మూసుకుపోయాయి



చెక్కపల్లి–చింతలవల్లి మధ్య సర్కారు తుమ్మ చెట్లు దట్టంగా పెరిగి రహదారులను మూసివేశాయి. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాహనచోదకులు ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే భయపడుతున్నారు. తక్షణమే జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలి.
– కూసం సత్యనారాయణ, చెక్కపల్లి

దారి కనిపించడం లేదు...



నూజివీడు–ముసునూరు రహదారిలో ఇరువైపులా ముళ్లకంపలు బాగా పెరిగిపోయి దారి కనిపించడం లేదు. దీంతో పెద్ద వాహనాలు ఎదురుగా వచ్చినపుడు భయాందోళనలకు గురికావాల్సిన పరిస్థితి నెలకొంటోంది. వెంటనే ముళ్లపొదలు తొలగించాలి.
– కోన రమేష్, కాట్రేనిపాడు